స్కెచ్

# పండగ మామూళ్లు

బ్రహ్మంరాజు కృష్ణమోహన్

మా వాడు యీ మధ్యనే అభ్యుదయవాదిగా మారాడు. ఇంతకుముందు, ఆఫీసులోనూ, హోటల్లోనూ, రోడ్డుమీద, సినిమా హాల్సు దగ్గర హైందవ ధర్మాన్ని నిలబెట్టడానికి చాలా కృషిచేశాడు. ఇందుకోసం చాలా మాట్లు కొట్లాట దాకా పరిస్థితి వచ్చింది. హిందువుల పండగలను పొగడుతూ, అవిచాలా నీతిదాయకమైనవనీ, మిగతా మతస్థులవారివన్నీ కేవలం డబ్బుతో కూడుకున్నవనీ, అవి సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండేవి కావనీ, పైగా మతపిచ్చి ఎక్కిస్తాయనీ, హిందూ ధర్మ సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు, పండగలు మొదలైనవన్నీ పరమార్థాన్ని బోధించి, ముక్తిని ప్రసాదిస్తాయని యింకా యిలాగే వాదిస్తూ, హిందూమతానికి వ్యతిరేకంగా బ్రాహ్మణకుల రక్షణకై పోరాడాడు మిత్రులతో. అలాంటివాడు యీ మధ్యనే, అంటే సంక్రాంతి పండుగ ఒకవారం రోజులుందనగానే, హఠాత్తుగా అభ్యుదయగాముడని పేరుపొందాడు, కమ్యూనిస్టు, సోషలిస్టు మిత్రులలో.

మావాడు ఏదో లేని కుటుంబీకుడు. ముగ్గురు పిల్లలు. జీతం నూటయాభైకి కొంచెం ఎక్కువే. చేసేది టైపిస్టు ఉద్యోగం. బహుశ యీ కారణాలచేతనే, అంటే ఆర్థికంగా చితికిపోవటంచేత, అభ్యుదయవాదానికి ఆకర్షితుడైనాడని అనుకోవచ్చు. ఎలెక్షన్లు సమీపిస్తున్నాయి కాబట్టి, సోషలిస్టులతో, కమ్యూనిస్టులతో పోటీచేసి గెలిపించితే, వారు బహుశ జీతాలు పెంచి, మావాడిలాంటి స్థితి మార్చగలరనీ, అందుకనే మావాడు అభ్యుదయవాది అయ్యాడని ఊహించవచ్చు. లేదా స్వయంగా వాడిలో యేదో అపూర్వమైన విప్లవభావాలు, కేవలం సంఘక్షేమం కొరకు ప్రవేశించాయని, ఇహ సమతత్వవాదిగా మారాడని అనుకోవచ్చు. కాని దీనికో ప్రత్యేక కారణముంది. పండగ దగ్గరౌతోంది, ప్రతిపండుగకూ యేదోసాకు పెట్టి మామూళ్ళు, చందాలు ఎగగొట్టడం వాడికలవాటు. ఇదివరకు రెండుసార్లు సంక్రాంతి మామూళ్లు యివ్వక పోయేటప్పటికి దొడ్లో పిడకలు, రెండు సలకల కట్టెలు మాయమైపోయాయి. అయినా మావాడు నిబంధనగా ప్రతీకగా నమ్ముతూ అది అలా చేయించటం, తనకు చాలా సంతోషమనీ, హిందూధర్మం ప్రకారం అలా జరిగితేనే ఆనందముందనీ, చెప్పుతూవుండేవాడు. ఇంట్లో సరిగా జాగ్రత్త చేయలేనందుకు భార్యనూ తల్లినీ, తిట్టేవాడు. అయితే. యీసారి పండగకు మావాడి బుర్ర విప్లవభావాన్ని నిజంగానే అప్పు తీసుకుంది. సంక్రాంతి పండగ. ఇహ ఒక్కరోజు మాత్రమే వుంది ఆరాత్రి ఎలాగూ చందాకోసం వస్తారు. రెండు రకాలవాళ్ళు, కనీసం ఒక రూపాయైనా ఇవ్వక తప్పదు, లేదా, పిడకలు దొడ్లో, కట్టెలు, జాగ్రత్తగా దాచటం తప్పదు జాగ్రత్త కొంప. ఇంట్లో పెట్టాలంటే చాలదు, పిల్లల తలంట్లకోసం, పిండివంటలకోసం, రెండు సలకల కట్టెలు, ఒక బస్తా బొగ్గులు, కొయించుకున్నాడు. అవి పోతే ప్రాణం 'ఫసాదు' మవుతుంది. ఈమారు వాళ్ల మీద యుద్ధం ప్రకటించక తప్పదు. నిశ్చయించాడు. యుద్ధంలో నోడిపోతే, పోలీసులకు వెంటనే రిపోర్టుచేసి, వాళ్ళని జైలుకు పంపించాలి మరునాటినుంచి సనాతన్యాయులకు జైలు శిక్ష వేయించాలని కమ్యూనిస్టులకు చెప్పాడు. తనను గురించి మొంతో గొప్పగా వ్రాస్తారు. 'లేకపోతే, మతం. కులం. పేరు చెప్పి. దోపిడీ చేయడమా! ఏమిటో, నుంచి తేస్తారట. రాత్రిళ్లు ఎంతెంత కాపలా నుంచులు! హాయిగా నిద్ర కప్పుకొని యింటిలో పడుకుంటే వెచ్చగా వుండదూ? పిచ్చిమూకం! ఏంమతం హిందూమతం! రాసి, వాళ్ళరాత్రికి, ఎలా యెత్తుకుపోతారో, చూస్తా' అని భార్యను, తల్లిని,

దొడ్డిగుమ్మం దగ్గర కాపలా పెట్టి, తను వీధి గుమ్మం దగ్గర సైనికుడిలాగ నిలబడ్డాడు. పది కొండయింది. ఎవ్వరూ చందాకోసం రాలేదు. నిద్ర తోసుకొస్తోంది. భార్యను, తల్లిని, వెళ్లి పడుకోమన్నాడు. పన్నెండు కూడా అయింది. ఇహ చందాకోసం రారు, యెత్తుకుపోనూ పోరు. ఇది ఖాయం. దీనికోసం అమూల్యమైన నిద్ర చెడగొట్టుకోవడం దేనికి? పడుకున్నాడు. ఆలోచనలు అంతు లేకుండా బుర్రలో దొర్లిపోతున్నాయి. తనే ఒక పెద్ద ధనికుడైతే! గూర్ఖావాడిని గేటు కాపలా పెట్టేవాడు. గుమ్మంలో రెండు అల్సేషియన్ కుక్కలు యింటిని రక్షిస్తూ వుండేవి. కట్టెలు, బొగ్గులు, వుండే గదికి పది రూపాయలు ఖరీదు చేసే తాళం తగిలించి వుంచేవాడు. అసలు తన దివ్యభవనంలో దూరేకి ఎవడికి గుండె ధైర్యముంది? ఏమాత్రం చప్పుడైనా వెంటనే ముందు తన మంచం ప్రక్కన గోడమీద వున్న ఒక మీట నొక్కుతాడు. వెంటనే యింటి ద్వారాలు అన్నివైపులా బంధించబడతాయి. గంట మోగుతుంది. కుక్కలు అరుస్తాయి. లైట్లన్నీ ఒక్కసారి వెలుగుతాయి. గూర్ఖావాడు లేస్తాడు. దొంగల్ని పట్టేస్తాడు. వెంటనే ఫోనులో పోలీసుల్ని పిలిచి జైలుకి పంపించేవాడు. వాళ్ళని, కట్టెలు దొంగతనం చేయటానికి వచ్చారని చెప్పి .. కాని తనకా హోదా యెక్కడిది? పోనీ, తను ఒక పేరుబడ్డ భావిప్లవీకుడా అంటే, అదీ కాదు. అలా అయివుంటే, ఎవరూ తన దగ్గరకే వచ్చేవారు కాదు చందా అడగటానికి. ఇలాగే యింకా ఆలోచిస్తూవుండగా కునుకుపట్టింది. ఒంటిగంట అయింది. కలతనిద్రలో వున్నాడు.

ఎవరో తలుపు కొట్టినట్టయింది. ఉలిక్కిపడి లేచాడు. బ్యాటరీలైటు తీసుకుని, విప్లవ భావాలన్నీ మళ్ళీ నెమరుకు తెచ్చుకుని, (ఆ వచ్చినవాళ్లు చందాకోసం అయితే, వాళ్ళ ముందు ఏకరువు పెట్టటానికి) వెళ్ళి తలుపు తీశాడు. వచ్చింది ఎదురింటి సుబ్బయ్యనాయుడు గారు. రెండో ఆట సినిమాకి వెళ్ళివచ్చాననీ, ఇంటికొచ్చాక జట్కాబండివాడికి డబ్బు లిద్దామని జేబు తడుముకుంటే పర్సు కనబడలేదనీ, అది యెవరో కొట్టేశారనీ, ఒక్క రూపాయ బదులిమ్మనీ అడిగాడు. మావాడు "బ్రతికాము రా దేవుడా!" అని మనసులో అనుకుని, నిమిషంలో రెండురూపాయల నోటు తీసుకొచ్చి ఆయన చేతిలో పెట్టి "కావలసింది తీసుకోండి మిగతాది రేపు యిచ్చేద్దురు కాని ఏకంగా. నేను పడుకోవాలి" అని వెళ్ళి పడుకున్నాడు హాయిగా.

తెల్లవారింది. మావాడు కాలకృత్యాలు ముగించుకుని బజారు బయల్దేరాడు. తన పేటలో నలుగురూ కనపడి సవినయంగా నమస్కరించారు. ఒకమూల ఒక అరడజనుమంది గుమిగూడి, ఫలానా ఆయన రెండురూపాయలు చందా యిచ్చాడు, అని చెప్పుకుంటూ వుండగా విన్నాడు. వాళ్ళంతా కూడా ఈమాటు వంగివంగి నమస్కరించారు యెప్పుడూ లేనిది. మావాడికి ఆశ్చర్యమేసింది. నలుగురైదుగురు ఇంకా ఆ వీధిలోనే కనపడి "క్రిందటేడాదిదీ, ఇప్పటిదీ కలిపి ఒకేసారి యిచ్చేశారే! చాలా సంతోషం!" అని అభినందించారు. మావాడికేమీ అర్థంకాలేదు. బహుశ తను యెలాగో యివ్వడని తెలిసి ఎవరో పుణ్యాత్ముడు తన తరఫున కూడా ఇచ్చివుంటాడనుకుని వాళ్ళతో, "ఆ! ఏదో లెండి! తోచింది యిచ్చాను" అని మాత్రం అనగలిగాడు. బజారుపని చూసుకుని ఇల్లు జేరుకుంటున్నాడు. గడప మెట్లెక్కుతూ వుండగా సుబ్బయ్యనాయుడుగారు పలకరించి, అదోమాదిరిగా నవ్వుతూ నమస్కరించాడు. మావాడు మళ్ళీ నమస్కరించాడు. ఆయన మీసాలు మెలిపెట్టుకుంటూ, తనవైపే చూస్తూ వింతగా నవ్వుతూ వెళ్లిపోయాడు. మావాడి గుండెల్లో రాయి పడింది. "ఎంతమోసం!" అనుకున్నాడు.

"ప్రకాశాన్ని ఎన్నుకుంటే మీ మద్రాసు మీకు దక్కద"నే భయం మన ఆంధ్రమంత్రి వర్గీయులే తమిళులలో కలిగించారు.——"జై భారత్" సంపాదకీయం